
సాక్షి పల్నాడు
శనివారం । 2 । డిసెంబర్ । 2023



సెమీ క్రిస్మస్ వేడుకలు
బాపట్ల: బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకలను కళాశాల డీన్ డాక్టరు డిడి స్మిత్ ప్రారంభించారు.



స్వాములకు అన్నసమారాధన
నగరంపాలెం: గుంటూరు అరండల్‌పేట హంపి విరూపాక్ష పీఠ పాలిత శివాలయంలో అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన, రాత్రి భిక్ష వచ్చేనెల 10 వరకు చేయనున్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 524.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,000 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

78 శాతం పెన్షన్ల పంపిణీ



నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ అట్టహాసంగా ప్రారంభమైంది. ఒకటో తేదీ మంగళవారం తెల్లవారుజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. తొలిరోజు 78 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో ఈనెల 2,80,368 మందికి రూ.77,82,69,550ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా తొలిరోజు 2,18,687 మందికి రూ.48,67,95,000ను అందజేశారు.

రేపు అండర్-19 జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ ఎంపికలు

చిలకలూరిపేటటౌన్: అండర్-19 జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు ఈ నెల మూడో తేదీ పట్టణంలోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చేబ్రోలు మహేష్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అండర్-19 బాలబాలికల జిల్లా స్థాయి సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని, వీటిలో ఎంపికైన విద్యార్థులు డిసెంబర్ 8 నుంచి 10 వరకు బాపట్ల జిల్లా మార్టూరులో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొననున్న బాలబాలికలు ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఆధార్ కార్డు ఒరిజనల్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 79815 58151 సంప్రదించాలన్నారు. సమావేశంలో జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ అమీర్ హుస్సేన్ ఉన్నారు.

అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్‌కు అవార్డు



తెనాలిఅర్బన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిడ్స్ రోగులకు సేవలు అందిస్తున్న తెనాలికి చెందిన అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పి.రవికుమార్‌కు ఉత్తమ చారిటబుల్ ట్రస్ట్ అవార్డును అందజేశారు. గుంటూరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, న్యాయమూర్తి లీలావతి, జిల్లా ఎయిడ్స్ విభాగం అధికారి డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాలబాలికలు, 9వ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-17 బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి డి.అశోక్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక బీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. ఎంపికైన జట్లను ఈ నెల 8 నుంచి 10 వరకు విజయనగరంలో జరిగే రాష్ట్ర ఫెన్సింగ్ పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 92471 11266 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

యార్డులో 30,248 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 27,562 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,248 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.21,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,045 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సిరినవ్వుల ఆసరా

- దిగ్విజయంగా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా
- చికిత్స అనంతరం పేద రోగులకు అండ
- దేశంలో ఎక్కడా లేని విధంగా పోస్టు ఆపరేటివ్ అలవెన్సు పథకం
- ప్రారంభమై నేటికి నాలుగేళ్లు పూర్తి

గుంటూరు మెడికల్: అనారోగ్యానికి గురైన పేద రోగులు చికిత్సకు, తదనంతర కాలంలో జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించడంతోపాటు ఆ తర్వాత విశ్రాంతి కాలంలో పూర్తిగా కోలుకునేవరకు అండగా నిలిచేందుకు నిర్ణయించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. నాలుగేళ్లుగా దిగ్విజయంగా అమలు చేస్తున్నారు. ఈ పథకానికి 2019 డిసెంబరు 2న గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లోనే సీఎం శ్రీకారం చుట్టడం గమనార్హం.

1,519 శస్త్రచికిత్సలకు విశ్రాంత భృతి

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలోని 1,519 రకాల శస్త్రచికిత్సలకు రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5వేలు ప్రభుత్వం ఆపరేషన్ చేయించుకున్న వారికి విశ్రాంత భృతి ద్వారా అందిస్తోంది. రోగి ఆస్పత్రిలో ఆపరేషన్ కోసం చేరిన వెంటనే ఆరోగ్యమిత్ర రోగి బ్యాంకు అకౌంట్ నంబరును తీసుకుని రిజిస్టర్ చేస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి వెళ్లిన 48 గంటల్లో రోగి బ్యాంకు ఖాతాలో నేరుగా విశ్రాంత భృతి జమవుతోంది. ఒక వేళ రోగికి బ్యాంకు అకౌంట్ లేని పక్షంలో ఎవరైనా అతని కుటుంబ సభ్యుల బ్యాంకు అకౌంట్‌ను తీసుకుని అందులో జమ చేస్తారు. కుటుంబ సభ్యులకూ లేని పక్షంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయానికి రోగి వివరాలు పంపించి అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య మిత్ర ద్వారా రోగికి చెక్కు, లేదా డీడీ రూపంలో విశ్రాంత భృతి అందిస్తున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరోగ్య ఆసరా ద్వారా లబ్ధి ఇలా ..

సంవత్సరం	రోగుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	5,934	3.736
2020–21	15,174	8.899
2021–22	26,578	13.491
2022–23	37,836	21.600
2023–24 (అక్టోబర్‌వరకు)	35,554	17.699
మొత్తం	1,21,076	65.425

రూ.60 వేలు లబ్ధి
పొన్నూరు టీచర్స్ కాలనీకి చెందిన వి.చంద్రలీల మూడేళ్లుగా పెమ్ఫిగస్ అనే అరుదైన చర్మ వ్యాధితో బాధపడింది. భర్త 20 ఏళ్ల క్రితమే మరణించాడు. రోజువారి కూలిగా పనిచేస్తుంది. నవంబర్ 11న గుంటూరు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ వార్డులో చేరింది. నవంబర్ 28 వరకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చికిత్స పొందింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన సమయంలో ఆమె బ్యాంకు ఖాతాకు నేరుగా రూ.60,000 ప్రభుత్వం జమ చేసింది. పూర్తిగా కోలుకునేవరకు ఆమెకు ఈ డబ్బు ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావించింది. దీంతో చంద్రలీల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రారంభించి గుంటూరు జీజీహెచ్‌లో రోగులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో మంత్రి రజిని తదితరులు (ఫైల్)

పేదలకు ఎంతో ఉపయోగం



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా అత్యద్భుతమైన పథకం. దీని ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. చికిత్స పొందిన తర్వాత వ్యాధి నుంచి పూర్తిగా కోలుకునేవరకు కొన్ని రోజులపాటు తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలి. అలాంటి సమయంలో పేద రోగులు ఇబ్బంది పడకుండా నగదు జమ చేయడం గొప్ప విషయం.

– డాక్టర్ చీకటి విజయ్‌ప్రకాష్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

జల దోపిడీ చేస్తూ మా సీఎంపై ఆరోపణలా

- మాపై మీ పెత్తనమేంటి
- సీఎం జగన్‌ను విమర్శిస్తే తాటతీస్తాం
- తెలంగాణ పార్టీలపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పీఆర్కే ధ్వజం



మాచర్ల: నాగార్జున సాగర్ రిజర్వాయర్ నుంచి హక్కుగా రావాల్సిన నీటిని తెలంగాణ ప్రభుత్వం హరిస్తుంటే ఇన్నాళ్లు ఓపిక పట్టిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల తాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి రెండు రోజుల కిందట కుడికాలువ ద్వారా 3,300 క్యూసెక్కులను విడుదల చేసుకుంటే దీనిని తెలంగాణలోని వివిధ పార్టీలు రాజకీయం చేయటం అత్యంత దారుణమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పల్నాడు జిల్లా మాచర్లలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విభజన జరిగిన తరువాత తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలుగా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పాదన చేసుకుంటూ జల దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ భూభాగంలోని నాగార్జున సాగర్ 13 ప్రధాన క్రస్ట్‌గేట్లు, కుడికాలువ పరిధిలో ఉండగా వాటిపైనా పెత్తనం చేస్తోందని ధ్వజమెత్తారు. తమ హక్కుల కోసం తాము పోరాడుతుంటే తెలంగాణాలో వివిధ పార్టీలు రాజకీయాల కోసం సీఎం జగన్‌పై విమర్శలు చేయటం హాస్యాస్పదమన్నారు. తమ సీఎం జగన్‌పై విమర్శలు కొనసాగిస్తే ఊరుకునేది లేదని, తాటతీస్తామని పిన్నెల్లి హెచ్చరించారు. తమ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, దీనిని గుర్తించకపోతే తెలంగాణ పార్టీలన్నీ ఇబ్బంది పడతాయని స్పష్టం చేశారు. తమ హక్కుగా రావాల్సిన నీటిని తమకివ్వాల్సిందేనని పిన్నెల్లి పునరుద్ఘాటించారు.

భవానీ దీక్షల విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఆలయంలో భవానీ దీక్షల విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. దీక్షల విరమణకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం భవానీ దీక్షా విరమణలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై దేవదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 7 వరకు ఐదు రోజుల పాటు భవానీ దీక్షా విరమణల సమయంలో రోజూ సుమారు 50 వేల నుంచి లక్ష మంది వరకు, చివరి రెండు రోజుల్లో లక్షన్నర వరకు భవానీలు వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవానీ దీక్షల విరమణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో కేఎస్ రామారావు కలెక్టర్‌కు వివరించారు. మూడు హోమ గుండాలు, సీతమ్మవారి పాదాలు, పున్నమి ఘాట్, భవానీ ఘాట్ వద్ద మొత్తం 800 వరకు షవర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమ, ఏఈవోలు పి.చంద్రశేఖర్, ఎస్.రమేష్, పి.సుధాకర్, జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్లు వై.హేమదుర్గ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లు మృతి

- చర్చికి వెళ్తుండగా దుర్ఘటన
- ఆరుంబాక గ్రామంలో విషాదం

చెరుకుపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని తల్లీకూతుళ్లు దుర్మరణం పాలైన ఘటన ఆరుంబాక గ్రామంలో విషాదఛాయలు నింపింది. స్థానికుల కథనం ప్రకారం చెరుకుపల్లి మండలం ఆరుంబాక గ్రామానికి చెందిన న్యాయవాది కర్రా ప్రతాప్ భార్య కర్రా విజయ కుమారి(43), కుమార్తె ఆశ్రిత(20)శుక్రవారం తెల్లవారుజామున నడుచుకుంటూ చర్చికి వెళ్తుండగా చెరుకుపల్లి హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన విజయకుమారి, ఆశ్రితను స్థానికులు చెరుకుపల్లిలోని వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ వై.సురేష్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శించిన ఎంపీ మోపిదేవి

ప్రమాద విషయాన్ని తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మృతదేహాలను సందర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసానిచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మోపిదేవి వెంట ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.





మృతదేహాల వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు (ఇన్‌సెట్‌లో) విజయ కుమారి, ఆశ్రిత(ఫైల్)

రేపటి నుంచి అగ్రిటెక్ వ్యవసాయ సాంకేతిక సదస్సు

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం లాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన అగ్రిటెక్ బ్రోచర్ విడుదల కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈనెల 3 నుంచి 5 వరకూ వ్యవసాయ సాంకేతిక సదస్సును నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏర్పాటు చేస్తున్న ఈ సదస్సులో 3న సాంకేతికతపై సదస్సు జరుగుతుందన్నారు. 4న ఆధునిక, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, 5న నేల దినోత్సవం సందర్భంగా రైతులకు క్విజ్ పోటీలు, బహుమతుల ప్రదానం జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. అధునాతన వ్యవసాయ విధానాలతో కూడిన 125 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. 50 వేల మంది సందర్శకులకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శారదజయలక్ష్మి తదితరులు

సేద్య విద్య.. చేల మధ్య

- పంట పొలాల్లో వ్యవసాయ విద్యార్థినులు
- స్వయంగా పరిశీలన.. సాగుపై అవగాహన
- కర్షక కష్టనష్టాలపై అధ్యయనం

యడ్లపాడు: సేద్య విద్యార్థులు చేల మధ్య సందడి చేస్తున్నారు. రైతు కుటుంబాల నుంచి వచ్చిన వీరు సాగును పండగ చేయాలన్న ఉద్దేశంతో అగ్రికల్చర్ కోర్సును ఎంచుకున్నారు. మరికొద్ది రోజుల్లో కోర్సు పూర్తవుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు చేలబాట పట్టారు. బాపట్ల వ్యసాయ కళాశాల విద్యార్థినులు 28 మంది గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ(రావే) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మాదల, సాతులూరు, ఇరుకుపాలెం, చాగంటివారిపాలెం, యడ్లపాడు, జగ్గాపురం గ్రామాలకు విచ్చేశారు.

ఏరువాక శాస్త్రవేత్తల సహకారంతో..

నవంబరు 2 నుంచి గ్రామాలకు చేరిన వీరు ఫిబ్రవరి మొదటి వారం వరకు ఆయా గ్రామాల్లో విత్తు మొదలు పంట ఇంటికొచ్చే వరకు సమగ్ర సాగు విధానంపై అధ్యయనం చేస్తున్నారు. కర్షకుల కష్టనష్టాలను తెలుసుకుంటున్నారు. రోజూ పొలాలకు వెళ్లి రైతులతో మమేకం అవుతున్నారు. వారి అనుభవాలను తెలుసుకుని సాగులో తలెత్తే సమస్యల పరిష్కారంలో కళాశాల అధ్యాపకులు, ఏరువాక శాస్త్రవేత్తల సహకారంతో భాగస్వాములు అవుతున్నారు.



మిర్చి పంటలో తెగుళ్ల గుర్తింపుపై అధ్యయనం చేస్తున్న విద్యార్థినులు

అభ్యుదయ రైతు గైడ్‌గా..
గ్రామాలకు వచ్చిన ప్రతి విద్యార్థికీ ఓ అభ్యుదయ రైతు గైడ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థలు, వాటి సేవలు, స్థానిక ప్రజల జీవనం, రైతులు, వారి సేద్య విధానాలు, భూములు, అందులో పండించే పంటల రకాలు, ఆయా పంటల్లో వచ్చే సమస్యలు, అవలంబించే పరిష్కార మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్‌బీకేలు, వాటి సేవలు, సాంకేతికం ఇలా భిన్న కోణాల్లో అన్ని అంశాలనూ వివరిస్తున్నారు. చివరిగా రాబోయే నెలల్లో ఆర్‌బీకేల అనుసంధానంతో రైతు సదస్సులు, వ్యవసాయ ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలను విద్యార్థినులు నిర్వహించనున్నారు. అయా విషయాలను తమ రికార్డుల్లో నమోదు చేసుకుని కళాశాలకు సమర్పించనున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలమవుతాం



వ్యవసాయ శాస్త్రవేత్తలం కావాలన్నదే మా కల. అందుకే ఈ కోర్సు ఎంచుకున్నాం. పాఠాలు విన్నప్పటికంటే పొలాలకు వెళ్లి చూడటం వల్ల విషయంపై అవగాహన పెరిగింది. సంప్రదాయ పంటల్లో వచ్చే సమస్యల్ని ఏరువాక శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్తున్నాం. వారిచ్చే సలహాలు, సూచనలు రైతులకు చెబుతున్నాం. గ్రామాల్లో తిరిగి సామూహిక చర్చలు చేస్తున్నాం. సాగును లాభసాటిగా మార్చడమే మా లక్ష్యం.

– బి.అమృత, జాహ్నవి, అశ్వతిఅశోక్, ఎస్.కుందనకాంక్ష, ఎం.భావన, యడ్లపాడు

రైతులకు అండగా నిలబడతాం



నాట్లు వేయడం, ఎరువులు చల్లడం, పురుగు మందుల పిచికారీ, లింగాకర్షక బుట్టలు పెట్టడం, పసుపు, నీలం రంగు అట్టల ఏర్పాటు. గ్రామాల్లోని పంటలు, సాగు చేసే రైతులు, వివిధ రంగాల గురించి సర్వే నిర్వహణ వాటిని చిత్రపటాలు వేసి ప్రదర్శనలు చేస్తున్నాం. గ్రామ అవసరాలు, పంటసాగులో మెళకువలు, యంత్రాలతో కొత్త సాగు విధాలపై అవగాహన కల్పించడం. రైతుల అనుభవాల్ని నిత్యం తెలుసుకుంటూ మాకు తెలిసిన విషయాలు వారికి చెబుతున్నాం.

– సీహెచ్ హరిప్రియ, ఎ.ఐశ్వర్య, మేఘనభల్లా, జి.మహాలక్ష్మి, జగ్గాపురం

ఎంతో ఉపయోగం



క్షేత్రస్థాయిలో వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ప్రతి విద్యార్థికీ ఓ అభ్యుదయ రైతు మార్గదర్శకంగా ఉండడం మేలు చేస్తుంది. సాగులో వస్తున్న మార్పులు, చీడపీడల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, పంట ఉత్పత్తులు తగ్గకుండా ముందస్తుగా చేపట్టాల్సిన ప్రణాళికలు అన్నీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగతమవుతాయి.

– డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, ప్రధాన శాస్త్రవేత్త/సమన్వయకర్త, జిల్లా ఏరువాకకేంద్రం, పల్నాడు

భళా.. వైఎస్సార్ జల కళ

- బీడుల్లో జలసిరుల పరవళ్లు
- మాచర్ల నియోజకవర్గంలో 754 బోర్లు
- 3,770 ఎకరాలకు సాగునీరు

కారెంపూడి: మాచర్ల నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ బోర్ల కింద సాగు బ్రహ్మాండంగా జరుగుతోంది. 754 బోర్లు వేయగా, వీటి ద్వారా 3,770 ఎకరాలకు నీరు అందుతోంది. ఎంతో కాలంగా నీరు లేక బీడులుగా ఉన్న పొలాలలో జలసిరులు పరవళ్లుతొక్కుతున్నాయి. ఫలితంగా నిత్యం పైర్లతో భూములు కళకళలాడుతున్నాయి. ప్రత్యేకించి ఈ ఏడాది తలెత్తిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలకళ బోర్లు వరంగా మారాయి. ఫలితంగా రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రైతుకూలీలకు సమృద్ధిగా పని దొరుకుతోంది. ఒక్క ఎకరంలో మిర్చి పంట వేస్తే 300 మంది కూలీలలకు పనులు దొరుకుతాయి. ప్రస్తుతం 70 శాతం భూముల్లో మిర్చి సాగవుతోంది. వైఎస్సార్ జల కళ పథకాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ఆదేశాలతో అధికారులు సమర్థంగా అమలు చేయడం విశేషం.



ఉబికివచ్చే గంగకు దండం పెడుతున్న రైతు

జగనన్నకు వందనం



నిజంగా బోరు వేయించుకోవడమంటే మా వల్ల అయ్యే పని కాదు. రూ.5 లక్షల దాకా ఖర్చు అవుతాయి. ఖర్చంతా ప్రభుత్వమే భరించి నా పొలంలో బోరు వేశారు. నీరు పుష్కలంగా పడింది. నాలుగెకరాల భూమిలో మిర్చి, మొక్కజొన్న సాగు చేస్తున్నాను. రైతులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎనలేని ప్రేమ ఉంది. నిజంగా జగనన్నకు వందనం.

– బొమ్మిన వెంకటేశ్వర్లు, రైతు, కారెంపూడి

జగనన్న చేసిన మేలు మరువలేం



పొలానికి నీటి సౌకర్యం ఉంటే ఆ కళే వేరు. ఇది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ జలకళ పథకం వల్ల సాకారమైంది. నా ఐదెకరాల చేలో బోరు వేశారు. నీరు కూడా బాగా పడింది. మునగ, మిర్చి, పత్తి పంటలను పండిస్తున్నా. గతంలో నీటి సౌకర్యం లేక వేసిన పంటలు వర్షాభావం వల్ల నిలువునా ఎండిపోయేవి. ఇప్పుడు ఆ భయం లేదు. జగనన్న చేసిన మేలు మరువలేనిది. ఆయనకు కృతజ్ఞతలు.

– పాతూరి భద్రారెడ్డి, రైతు, కారెంపూడి

క్లుప్తంగా

పట్టపగలు ఇంట్లో చోరీ

18 తులాల బంగారం అపహరణ

మాచవరం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీరువా తాళాలు పగలగొట్టి బంగారు నగలు చోరీ చేసిన ఘటన మాచవరం రచ్చబండ సెంటర్లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుడె వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయాన్నే గుంటూరు ఆసుపత్రికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. పొలం నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న సుమారు 18 తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయని గుర్తించారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ సమీర్ బాషా పరిశీలించారు. క్లూస్ టీం ఇంటి పరిసరాలను, ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి అభినందనలు

లక్ష్మీపురం: ఈ ఏడాది నవంబర్‌లో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో మొదటిసారిగా టికెట్ చెకింగ్ సిబ్బంది రూ.1.35 కోట్లను జరిమానాలుగా విధించినట్లు డీఆర్ఎం రామకృష్ణ, డీసీఎం కమలాకర్‌బాబు, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ తెలిపారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం టికెట్ చెకింగ్ సిబ్బంది వై.ఎస్.పద్మారావు, కె.ప్రవీణ్ కుమార్, సంతోష్ ఝ, కె.హేమలత, కె.ఆర్.ఎం.రెడ్డి, డి.అశోక్‌లను వారు అభినందించారు. ఈ సందర్భంగా డీసీఎం కమలాకర్ బాబు మాట్లాడుతూ నవంబర్‌లో జరిమానాల నిర్దేశిత లక్ష్యం రూ.83 లక్షలకు గానూ రూ.1.35 కోట్ల వరకు జరిమానాలు వసూలు చేసినట్లు చెప్పారు. డివిజన్ ఏర్పడినప్పటి నుంచి ఇంత భారీస్థాయిలో జరిమానాలు విధించడం తొలిసారని తెలిపారు. బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించిన ఆరుగురు సిబ్బందిని డివిజన్ పరిధిలోని సిబ్బంది అంతా ఆదర్శంగా తీసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

బోన్సాయ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): శిల్పి రాయిని శిల్పంగా ఎలా మలచుతారో బోన్సాయ్ మొక్కలను కూడా అనునిత్యం సంరక్షించి వాటిని ఆకర్షణీయంగా మల్చటంలో బోన్సాయ్ కళాకారులు కృషి ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. రాజీవ్ గాంధీ పార్కులో అమరావతి బోన్సాయ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జరిగే బోన్సాయ్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. బోన్సాయ్ మొక్కల పెంపకానికి తగిన శిక్షణ, అవగాహన అవసరం అని, ఇందులో నిష్ణాతులుగా మారాలంటే ఓపిక, సహనం అధికంగా ఉండాలన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడారు.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట

రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ శాఖ సలహాదారు నాగార్జునరెడ్డి



తరగతి గదిలో డిజిటల్ బోర్డును పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి

అచ్చంపేట: జగనన్న ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ శాఖ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అచ్చంపేట మండలంలోని అచ్చంపేట, పెదపాలెం, తాళ్లచెరువు గ్రామాలలో పర్యటించారు. జగనన్న కాలనీలు, నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, ఉపాధి పనులను తనిఖీచేశారు. అచ్చంపేట జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. అమ్మఒడి, జగనన్న కానుకలు అందరికి అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వడం ద్వారా విద్యకు ఇచ్చే ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం తాళ్లచెరువులో సీసీ రోడ్లు, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పరిశీలించారు. జగనన్న కాలనీలు తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో డ్వాక్రా అక్కచెల్లెమ్మలతో నాగార్జునరెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. జగన్న ప్రభుత్వం వచ్చిన తరువాతనే మీ అందరి రుణాలు మాఫీ అయిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మంచి నాయకత్వానికి అండగా ఉండాలని సూచించారు.

మంచి భవిష్యత్ ఇచ్చారు..గుర్తుపెట్టుకోండి

అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. నిరుద్యోగులుగా ఉన్న మీ అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి మంచి స్థాయికి తీసుకు వచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. విధులను సక్రమంగా నిర్వహించాలని, మళ్లీ సీఎంగా జగన్ అయితేనే మీభవిష్యత్ బాగుంటుందని వివరించారు. ఆయన వెంట డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, ఎంఈఓ నరసింహారావు, ఉపాధి ఏపీఎం నాగశ్రీనివాస్, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, పెదపాలెం మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్ జిల్లాస్థాయి పోటీలు

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని వెల్లడి
- బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ సంస్థ వేదిక
- ఈ నెల 11,12 తేదీల్లో నిర్వహణ



కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని

యడ్లపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో 'కళా ఉత్సవ్ 2023- 24' పోటీలను ఈనెల 11, 12వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10, 11, 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో 2015 నుంచి ఏటా నిర్వహిస్తున్న ఈ కళా ఉత్సవ్‌లో పది విభాగాల్లో విద్యార్థులకు పోటీలు ఉంటాయని చెప్పారు. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నాట్యం విభాగాల వారికి డిసెంబరు 11న, టు డైమన్షన్, త్రీ డైమన్షన్, ఆర్ట్, దేశీయ బొమ్మలు, ఆటలు, నాటకం (ఏకపాత్రభినయం), 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాల బాలికలకు వేర్వేరుగా పోటీలుంటాయని, పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చూపిన ప్రతి విభాగంలో ఒక్కొక్కరికీ మాత్రమే విజేతలకు ఎంపిక చేస్తారు. ఒక్కొక్క విద్యార్థి ఒక్కో విభాగంలో మాత్రమే పాల్గొనేందుకు అర్హులు. గతంలో కళాఉత్సవ పోటీల్లో పాల్గొని మొదటి మూడు స్థానాలు బహుమతులు పొందిన విజేతలకు పాల్గొనే అనుమతి లేదు. జిల్లాస్థాయిలో జరిగే ఆయా పోటీల నిర్వహణకు కోఆర్డినేటర్‌గా ఎస్ఎం సుభాని, నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ కే ప్రసాద్ వ్యవహరిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థులు తమ వివరాలను సంబంధిత daitbo yapaem funtur@fmai.com మెయిల్‌కు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు డైట్ అధ్యాపకులు డాక్టర్ కే ప్రసాద్ సెల్‌నం: 80192 07528, కె అజయ్‌కుమార్ -94408 46045కు సంప్రదించాలన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

యద్దనపూడి: చోరీలకు పాల్పడిన నిందితుడిని యద్దనపూడి పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నవంబర్ 22వ తేదీన యద్దనపూడి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ చోరీకి పాల్పడటంతో పాటు వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు పరుచూరి వెంకటరామాచార్యులు ఇంట్లో దేవరకొండ శ్రీను చోరీకి పాల్పడ్డాడు. ఈ చోరీలో 8 సవర్ల బంగారం, 500 గ్రాముల వెండి వస్తువులు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఏటీఎం కార్డు తీసుకువెళ్లి మరో రూ.85 వేలు నగదు డ్రా చేసినట్లు చెప్పారు. నిందితుడు శ్రీను దొంగతనాలకి సంబంధించి పలు స్టేషన్‌ల్లో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి యనమదల సెంటర్‌లో దేవరకొండ శ్రీను అదుపులోకి తీసుకొని పర్చూరు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితుడి నుంచి రికవరీకి సంబంధించి పోలీసులు ఎటువంటి వివరాలు తెలపకపోవటం గమనార్హం.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

రూ.1.30 కోట్లకు పైగా నిధులు మాయం



రికార్డులు పరిశీలిస్తున్న విచారణాధికారుల బృందం

కారంచేడు: ప్రజాధనం దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. మండల కేంద్రం కారంచేడు మేజర్ పంచాయతీకి ప్రభుత్వ అభివృద్ధి నిధులతో పాటు, పంచాయతీ పన్నుల ద్వారా వచ్చే నిధులు భారీగానే ఉంటాయి. టీడీపీ సానుభూతి పరులే ఇక్కడ సర్పంచులుగా విజయం సాధిస్తూ వస్తున్నారు. పంచాయతీలో 2018-19 నుంచి 2020-23 వరకు సుమారు రూ.1.30 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం జరిగినట్లు టీడీపీ వార్డు మెంబర్ పీ ఆదిలక్ష్మి అక్టోబర్ 6వ తేదీన కారంచేడులో నిర్వహించిన కలెక్టర్ ప్రత్యేక స్పందన కార్యక్రమంలో అర్జీ పెట్టారు. దీంతో ఆయన వెంటనే పక్కనే ఉన్న బాపట్ల డీపీఓ రాంబాబును నిధుల దుర్వినియోగంపై పూర్తి స్థాయి విచారణ చేయించాలని ఆదేశించారు. డీపీఓ ఆదేశాల మేరకు చీరాల డీఎల్‌పీఓ డీ హనుమంతరావు నవంబర్ 21వ తేదీన నిధుల దుర్వినియోగం సమయంలో విధుల్లో ఉన్న ప్రత్యేక అధికారి నుంచి శానిటరీ మేస్త్రీల వరకు 18 మందికి నోటీసులు జారీ చేశారు. వీరందరూ డిసెంబర్ 1న పంచాయతీలో జరిగే విచారణకు పూర్తి సమచారంతో హాజరుకావాలని ఆయన కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ మధ్యాహ్నం వరకు రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదిదారురాలి నుంచి వివరాలు సేకరించారు. ఉద్యోగులు, సిబ్బందిలో కొందరు హాజరుకాలేదు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విచారణ నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు అందిస్తామన్నారు. విచారణ నివేదిక ఆధారంగా కలెక్టర్ బాధ్యులపై చర్యలు తీసుకుంటారన్నారు.

ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించండి

బ్రోచర్లు ఆవిష్కరించిన జేసీ శ్యామ్‌ప్రసాద్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఆరోగ్యశాఖ అధికారులు

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష-2.0 జనవరి ఒకటి నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున ఈనెల ఒకటో తేదీ నుంచి ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీ బ్రోచర్లను అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికాధికారి డాక్టర్ బి.రవి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ విజయ్‌ప్రకాష్, టీమ్ లీడర్ కే.సంపత్‌కుమార్‌లతో కలిసి ఆరోగ్యశ్రీ బ్రోచర్లు ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ ఇప్పటికే ఈ కార్యక్రమం గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఏఎన్ఎం (సచివాలయ ఆరోగ్య మిత్రలు)లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఏఎన్ఎంలు వారి గ్రామాలలోని ప్రతి ఇంటికి బ్రోచర్‌ను అందించటంతో పాటు ప్రతి విషయాన్నీ ప్రజలకు అర్థవంతంగా వివరించాలన్నారు. పథకం లక్ష్యాలు, ప్రయోజనాలను సవివరంగా తెలియజేయటంతోపాటు ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరి ఫోన్‌లోనైనా ఇన్‌స్టాల్‌చేసి లాగిన్ చేయించాలని ఆదేశించారు. యాప్‌లో ఉన్న ప్రతి అంశాన్ని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. పథకంపై ప్రజలకు అవగాహన కలిగేలా గ్రామస్థాయిలోని సచివాలయ ఆరోగ్య మిత్రలు కృషిచేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని డీఎండీహెచ్‌వో డాక్టర్ రవి పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ విజయ్‌ప్రకాష్ పర్యవేక్షణలో జిల్లాలోని ప్రతి సచివాలయంలోని ఆరోగ్యమిత్రలకు బ్రోచర్లు అందజేశామని టీం లీడర్ కే.సంపత్‌కుమార్ తెలిపారు. జనవరి నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 ప్రోగ్రాంను మరింతగా ప్రజల్లో తీసుకువెళ్లేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

నగదు చెల్లింపుల తర్వాత ఆ భూములు ప్రభుత్వానివే

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: వివిధ ప్రభుత్వ పథకాల కోసం సేకరించిన భూములకు నగదు చెల్లింపులు తర్వాత అవి ప్రభుత్వానికే చెందుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై డివిజన్, మండల, పౌరసరఫరాలు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. భూముల రీసర్వేపై సమీక్షిస్తూ మ్యూటేషన్ ఫర్ ట్రాన్సక్షన్లు, కరెక్షన్ల వివరాలు, తిరస్కరణకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు తిరస్కరణకు గల కారణాలను పరిశీలిస్తామని తెలిపారు. చుక్కల భూములు, 22ఏ అడంగల్ భూములు, సాదా బైనమా, భూముల మార్పులపై వివరాలు సేకరించారు. నీటి పన్నులను సకాలంలో కలెక్ట్ చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఆటోమిటేషన్ ఫెసిలిటీపై వివరాలు సేకరించారు. ఆన్‌లైన్ సర్వీసులు, పౌరసరఫరాల శాఖ ద్వారా ఎండీయు వాహనాల సేవలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రైతుల ఆత్మహత్యలకు గల కారణాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారి ఎం.శేషిరెడ్డి, మండల రెవెన్యూ అధికారి ఆర్‌వీ రమణ నాయక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనిల్ కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు జాతీయ స్థాయి గుర్తింపు



వైద్యశాలలో సూపరింటెండెంట్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు నేషనల్ అసెస్మెంట్ ముస్కాన్ ప్రోగ్రాం క్రింద క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏరియా వైద్యశాలలో నిర్వహించిన సమావేశంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ నవజాత శిశువుల వార్డును ఇటీవల క్వాలిటీ కంట్రోల్ కేంద్ర బృందం పరిశీలించి సంతృప్తి చెందటంతో ఈ సర్టిఫికెట్ అందజేశారన్నారు. నవజాత శిశువుల వార్డును కార్పొరేట్ స్థాయికి మించి సౌకర్యాలు కల్పించామని, వైద్యులు, స్టాఫ్ నర్సులు అందరూ ఒక టీం వర్క్ చేయడం వల్ల ఇది సాధ్యమైందన్నారు. ఎంతో క్లిష్టతరమైన ఈ సర్టిఫికెట్ రావటం ఆనందకరమన్నారు. వైద్యశాల అభివృద్ధిలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవ ఉండటం తమకు అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఒక అరుదైన అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని దీనికి ముఖ్య పాత్ర పోషించిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణకి, వైద్యశాలలోని వైద్యులు డాక్టర్ సుజాత, డాక్టర్ ప్రేమలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, ఎంబీఎస్సీ కౌన్సిలర్ రంగనాయక్, స్టాఫ్ నర్సులు ఉన్నారు.

విలక్షణ ఆలోచనలకు నిదర్శనం ఈ ప్రదర్శన

- వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- ఏఎన్‌యూలో ప్రారంభమైన జాతీయ చిత్రకళా ప్రదర్శన



ఫైన్‌ఆర్ట్స్ ఫెస్ట్‌ను ప్రారంభించి ప్రదర్శనలను తిలకిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ : వినూత్న, విలక్షణ ఆలోచనలకు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రదర్శన నిదర్శనంగా నిలుస్తుందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫైన్‌ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఫైన్‌ఆర్ట్స్ ఫెస్ట్‌ను శుక్రవారం వీసీ ప్రారంభించారు. పలు యూనివర్సిటీల విద్యార్థులు వేసిన కళాకృతులను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు తమ ఆలోచనలతో నూతన ఆవిష్కరణ వైపు నడిచేలా ప్రదర్శనలలో వారి ప్రతిభను కనబరిచారన్నారు. ఇతర రంగాలతో పోలిస్తే ఫైన్ ఆర్ట్స్ రంగం ఎంతో ప్రాముఖ్యత, ప్రత్యేకతను సంతరించుకుంటుందన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు ఈ ప్రదర్శనలో 150 కళాఖండాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన వీక్షకులను విశేషంగా ఆకర్షించి ఆలోచింపచేసే విధంగా ఉందని ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి అన్నారు. ఈ కార్యక్రమంలో గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అనిత, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మధుబాబు , కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీ కరపత్రం అందాలి



ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, సక్రమంగా వినియోగించుకునేలా ప్రతి ఇంటికీ కరపత్రం అందేలా చూడాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీపై డిసెంబరు 1 నుంచి నెల రోజులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం ఆయన పోస్టర్‌ను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు ప్రతి ఒక్కరూ పొందేలా కరపత్రాన్ని అందజేసి అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. మెడికల్ ఆఫీసర్లు బాధ్యతగా తీసుకుని సంబంధిత ఏఎన్ఎంల ద్వారా ప్రతి ఇంటికీ అందేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చీకటి విజయప్రకాష్ పాల్గొన్నారు.

ఓటర్ల క్లెయిమ్స్‌ను నిబంధనల ప్రకారం పరిష్కరించాలి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఫొటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని చెప్పారు. ఫారం - 6, 7,8ల క్లెయిమ్స్ వెరిఫికేషన్‌లో పెండింగ్ ఉండకూడదని సూచించారు. శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయినింగ్ డే జరుగుతోందని, బీఎల్వోలు తప్పనిసరిగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు ఫారాలు, రిజిస్టర్స్‌తో రావాలని ఆయన ఆదేశించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల లిస్టుల్లో జీరో డోర్ నంబర్ లేకుండా పూర్తి స్థాయి సవరణ చేయాలని చెప్పారు. ఓటర్ల వెరిఫికేషన్‌కు బీఎల్వోలు కచ్చితంగా వెళ్లాలని తెలిపారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పట్టణాలను తలదన్నేలా పల్లె రోడ్లు

బాపట్ల అర్బన్: పల్లె సీమల్లో పట్టణాలను తలదన్నేలా రోడ్ల నిర్మాణం చేపట్టడం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, దీనికి నరసాయపాలెంలోని కాలనీలో నూతనంగా నిర్మించిన రోడ్డే నిదర్శనమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ అన్నారు. శుక్రవారం రూ.50 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నరసాయపాలెంలో చూస్తున్నామని చెప్పారు. పల్లెల్లో రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్‌ల నిర్మాణం చేపట్టడం గొప్ప విషయమని, ఇలాంటి అభివృద్ధిని తమ స్వగ్రామంలోనూ అమలు చేస్తానని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన ఐదేళ్ల కాలంలో ఏడాదిన్నర పాటు కరోనాతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. నరసాయపాలెంలో బ్రహ్మాండమైన రోడ్డు నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఎంపీ నందిగం సురేష్, బాపట్ల ఎంపీపీ హరిబాబు గ్రాంట్ ఇచ్చారని, అందరి కృషితో మంచి అభివృద్ధిని చూస్తున్నామని చెప్పారు. తొలుత గ్రామంలోని అంబేడ్కర్, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, జెడ్పీటీసీ సభ్యులు పిన్ని బోయిన ఎస్తేర్ రాణి, సొసైటీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, నరసాయపలెం గ్రామ సర్పంచి హైమావతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 'బుల్లెట్ మిల్లెట్స్' ప్రాజెక్టు ఎంపిక

జిల్లా నుంచి ఎంపికైన ప్రాజెక్టు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు గంగవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ ఎంపికైంది. నవంబర్ 29, 30 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. దీనిలో భాగంగా ఇంకొల్లు మండలం గంగవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన 'బుల్లెట్ మిల్లెట్స్' ప్రాజెక్టు ఎంపికై ందని పాఠశాల పాఠశాల హెచ్‌ఎం కే వీరాంజనేయులు, కరస్పాండెంట్ ఎం. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. 26 జిల్లాల నుంచి 182 ప్రాజెక్టులు పాల్గొనగా రాష్ట్రస్థాయిలో 26 ప్రాజెక్టులను ఎంపిక చేశారన్నారు. జిల్లా నుంచి విద్యార్థులు పెద్దపల్లి అంకిత, కట్టా సాహితీలు చేసిన ప్రాజెక్టు ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు గైడ్‌గా వ్యవహరించిన సైన్స్ టీచర్ మేడికొండ సుమలతను, విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆగిన కేంద్రాలను ప్రారంభించాలి

డీసీవో రామారావు



మాట్లాడుతున్న డీసీవో రామారావు

అద్దంకి: నిలిచిన జగనన్న పాల వెల్లువ కేంద్రాలను వారం రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కోఆపరేటివ్ (డీసీవో) అధికారి రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ సమీక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీవో దేవసేన కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ మండలంలో 11 పాలవెల్లువ కేంద్రాలు నిలిచిపోయాయన్నారు. వాటిని వారం రోజుల్లో ప్రారంభించేలా ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే ఎక్కడైనా పరికరాలు మరమ్మతులకు గురైతే చొరవ తీసుకోవాలని చెప్పారు. ఆగిన కేంద్రాలను ప్రారంభించడానికి వెటర్నటరీ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది కలసి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, వెటర్నరీ ఏడీ, ఏపీఎం కోటేశ్వరరావు, పశు వైద్యాధికారి పాల్గొన్నారు.